




రమాదేవి బుక్కపట్నం

**రాత్రి** ఎనిమిది గంటలు కావొస్తోంది. పల్లెటూరు అయినందున అందరూ తొందరగా తిని నిద్రపోతారు. పగలంతా పొలం పనులతో కష్టపడతారు కదా! కానీ చైత్ర కు మాత్రం రాత్రి పదకొండు గంటలకు పడుకునే అలవాటు. కానీ ఈ రోజెందుకో అసలే నిద్ర రావడం లేదు.

అరవింద్ ఆ గ్రామంలో విలేజ్ సెక్రెటరీ గా పని చేస్తున్నాడు. భార్య చైత్ర మరియు అనుపమ, అనురూప్ అనే తన పిల్లలతో పాటు ఇదే విలేజ్ లో ఇల్లు అద్దెకు తీసుకొని ఆరు నెలలుగా ఉంటున్నాడు. తన ఇంటికి కిలోమీటరు దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కూతురు అనుపమను మూడవ తరగతిలో, కొడుకు అనురూప్ ను నాలగవ తరగతిలో చేర్పించాడు. ప్రభుత్వ ఉద్యోగి వై ఉండి పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించకుండా ఈ పాఠశాల కెందుకు పంపు తున్నారని అడిగిన వాళ్లందరికీ అరవింద్ ఒకటే సమాధానం చెబుతూ వచ్చాడు. క్వాలిఫైడ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటారని, వారు బాగా పని చేస్తారని నా నమ్మకం. అందుకు మేమే ఉదాహరణ. మా అన్నదమ్ములందరమూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాము అని చెప్పాడు. వీలైతే మీరందరు కూడా మీ పిల్లలను అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్చమని కూడా సలహా ఇస్తాడు.

ప్రతిరోజూ అరవింద్ తాను డ్యూటీకి వెళ్ళేటప్పుడు పిల్లలిద్దరినీ పాఠశాలలో దింపుతాడు. సాయంత్రం పిల్లలు నడుచుకుంటూ ఇంటికి వస్తారు.

చైత్రకు ఇలా పల్లెటూర్లు ఇష్టం ఉండదు. ఇక్కడ సాయంత్రం కాగానే అందరూ తాగుతారు ,ఏదేదో వాగుతారు అని అని ఒక అభిప్రాయంతో ఉండేది. ఇక్కడినుండి కొంచెం పెద్ద ఊరికి ట్రాన్స్ఫర్ అయితే బావుండు. అని ఆలోచిస్తూ ఉన్న చైత్ర కు ఎప్పుడో నిద్ర పట్టేసింది.

రాత్రి పన్నెండవుతుండగా తలుపు దబ దబా బాదిన శబ్దంతో మెలకువ వచ్చింది. "ఇంత రాత్రి వచ్చింది ఎవరబ్బా?" అనుకుంటూ హాల్లోకి వచ్చింది చైత్ర.

"అమ్మా, అమ్మా, జర తలుపు తీయమ్మా, జల్ది తియ్యి. నన్ను కొట్టడానికి నా మొగుడు ఉరికొస్తున్నాడు. కాపాడమ్మా" అంటూ వీధిలో రెండిళ్ళవతల ఉండే భారతమ్మ ఏడుస్తూ వచ్చింది.

"వస్తున్నా, వస్తున్నా" అంటూ తలుపు తీసింది చైత్ర. వెంటనే ఒక్క అంగలో లోపలికి వచ్చి తలుపు వేసింది భారతమ్మ.

"ఏమైంది భారతమ్మా, మళ్ళీ రాజయ్య ఏమైనా అన్నాడా?" అంటూ గాబరాగా అడిగింది చైత్ర.

"అవునమ్మా, మళ్ళీ తాగి వచ్చిండు నా మొగుడు. తనకు ఇష్టమైన కూర చెయ్యలేదని తిడుతున్నాడు. కొట్టడానికే మీది మీది కొస్తున్నాడు. అమ్మా, ఈ రాత్రికి ఇక్కడే పడుకుంటాను" అంది భారతమ్మ.

"సరే సరే ఏడవకు, ఇక్కడే పడుకో, ఏం చెయ్యాలో రేపు ఆలోచిద్దాం" అని ధైర్యం చెప్పింది చైత్ర.

ఇలా అంటూండగానే బాగా తాగి ఉన్న రాజయ్య బూతులు తిడుతూ, అరుస్తూ వచ్చి భార్యను చేతులు పట్టుకొని తన ఇంటికి లాక్కెళ్ళడానికి ప్రయత్నించాడు. అరవింద్ లోపలి నుండి వచ్చి రాజయ్య ను ఉపాయంగా బయటికి తీసికెళ్ళి వాళ్ళింట్లో జాగ్రత్తగా పడుకోబెట్టి వచ్చాడు.

"చైత్రా, ఇక భయం లేదు. రాజయ్య వాళ్ళింట్లో బాగా నిద్రపోతున్నాడు. నీవు, భారతమ్మ ఇద్దరూ వెళ్లి పడుకోండి, అన్నాడు అరవింద్. భారతమ్మ వరండాలో హాయిగా నిద్రపోయింది.

చైత్ర కోపంగా భర్త దగ్గరికి వచ్చింది.

"ఏమండీ, ఏమిటండీ ఈ గోల. ఎప్పుడూ వాడు తాగి రావడం, కొట్టడం, భారతమ్మ మనింటికి పరుగెత్తుకుంటూ రావడం. ఇవన్నీ నాకేమీ బాగాలేదు. ఇరుగు పొరుగు వాళ్ళు ఇలా ఉంటే ఎలాగండీ," అంటూ వాపోయింది.

"చైత్రా, నేను చెప్పేది విను. మనము సంఘంలో బ్రతుకు తున్నాము. రకరకాల మనస్తత్వాలు గలవాళ్ళు మనచుట్టూ ఉంటారు. మంచి, చెడు అందరిలో ఉంటుంది. కాస్త సర్దుకు పోవాలి", అంటూ అనునయించాడు అరవింద్.

"ఏమోనండీ, ఈ రాజయ్య నాకు ఎంత మాత్రం నచ్చడం లేదు. ఎప్పుడూ తాగుతూ, అరుస్తూ ఉంటాడు, ఇంత కష్టపడి పనిచేసే భార్యను ఎప్పుడూ తిడుతూ, కొడుతూ ఉంటాడు.నాకు చాలా చిరాగ్గా ఉంది." అన్నది చైత్ర.

"తప్పదు చైత్రా, ఈ చిన్న గ్రామంలో ఇంతకంటే అనుకూలమైన ఇల్లు దొరకదు, ఓర్చుకోవాలి", అంటూ నిద్రకు ఉపక్రమించాడు అరవింద్.

చైత్ర ఏదో ఆలోచిస్తూ, అసంతృప్తిగా ఫీలవుతూ తానూ నిద్రపోయింది.

***

వారం తరువాత ఒకరోజు సాయంత్రం నాలుగింటికి రావలసిన పిల్లలిద్దరూ ఐదు గంటలవుతున్నా ఇంటికి రాలేదు. అరవింద్ ఈ రోజు పొద్దున్న పిల్లలను స్కూల్లో వదిలి ఆఫీస్ పని ఉందంటూ జిల్లా కేంద్రానికి వెళ్ళాడు. వచ్చేసరికి బాగా లేట్ అవుతుందని చెప్పి వెళ్లారు. ఇప్పుడేమో పిల్లలు ఇంకా ఇంటికి రాలేదు.

"అమ్మా, ఆకలి అవుతుంది. ఏమైనా పెట్టు" అంటూ అల్లరి చేసే పిల్లలు రావడం ఆలస్యమౌతున్న కొద్దీ చైత్రలో గాబరా పెరిగిపోతుంది. జరగరానిది ఏదైనా జరిగిందేమో అన్న ఆలోచన నిలువనివ్వడం లేదు. క్షణ మొక యుగంలా గడుస్తుంది. ఏడుపొస్తుంది, ఏమి చేయాలో తోచడం లేదు. ఇంట్లోకి బయటికి కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ ఉంది చైత్ర.

దాదాపు ఐదున్నర కావస్తుండగా ఇంటిముందు ఆటో ఆగింది. ఒక్క అంగలో బయటకు వెళ్ళింది చైత్ర. భారతమ్మ భర్త రాజయ్య ఆటోలో నుండి పిల్లలిద్దరినీ దింపుతున్నాడు. పిల్లలకు దెబ్బలు తగిలి కట్లు కట్టి ఉన్నాయి. ఏడుపు గొంతుతో పిల్లలను దగ్గరికి తీసుకొని "ఏమైంది నాన్నా, ఈ కట్లేమిటి?" అంటూ అడిగింది చైత్ర.

"అమ్మా, పిల్లలిద్దరూ స్కూల్ నుండి వస్తూంటే వేరే ఎవరిదో స్కూటర్ గుద్దేసింది. పిల్లలకు కాస్త దెబ్బలు తగిలినాయి. మరీ పెద్ద దెబ్బలేమీ కాదులెండమ్మా. ఏడుస్తూ రోడ్డు పక్కన అలాగే కూర్చున్నారు. సమయానికి నేను అటుగా వెళుతుంటే ఈ పిల్లలను చూసినాను. మీ సారు ఉదయం జిల్లా కేంద్రానికి వెళ్తూంటే కూడా చూసిన. అందుకే నేనే మన ఊర్లోని డాక్టర్ దగ్గరికి

వెళ్లి కట్టు కట్టించుకొని వస్తున్నాను. చిన్న దెబ్బలేనమ్మా. మీరు భయపడకండి. ఈ రోజు మీరు లేచిన వేళ బాగుంది", అంటూ చెప్పకొచ్చాడు రాజయ్య.

పిల్లలు క్షేమంగా ఇంటికొచ్చారన్న సంతోషం ఒక ప్రక్క, మంచివాడు కాదని తాను అసహ్యించుకున్న రాజయ్యే ఈ రోజు తన పాలిట దేవుడయ్యాడు. అనవసరంగా అతడిని తిట్టానన్న పశ్చాత్తాపము ఒకవైపు కలిగింది చైత్ర కు.

"చాలా థాంక్స్ రాజయ్యా. ఈ రోజు నువ్వు లేకపోతే పిల్లలు ఏమయ్యేవాళ్లో" అంటూ కన్నీళ్ళ పర్యంతమౌతూ రాజయ్య కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్పింది చైత్ర.

"దానిదేముందమ్మా, ఇరుగు పొరుగు అన్నాక ఆ మాత్రం సహాయం చెయ్యక పోతే మనుషులం ఎందుకమ్మా? మనకు కాస్తయినా మానవత్వం ఉండాలి కదా. పిల్లలు ఎవరికైనా పిల్లలే కదమ్మా", అన్నాడు రాజయ్య .

సంతోషం, కృతజ్ఞత నిండిన కళ్ళతో పిల్లలను లోపలికి తీసుకెళ్లింది చైత్ర.

***







